నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | ఆదివారం 4 ఆగస్టు 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్యే జీఎస్‌ఆర్

# యువతకు ఉపాధి కల్పిస్తాం

- 200 పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం
- మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, సీతక్క
- గణపురంలో ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

కృష్ణకాలనీ/గణపురం/భూపాలపల్లి రూరల్, ఆగస్టు 3 : నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క అన్నారు. ఇందుకుగాను ఇండస్ట్రియల్ పార్కులో 200 పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం మైలారంలో రూ.50 కోట్లతో ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేసి జిల్లా దవాఖానలో రూ.3.60 కోట్లతో ఔషధ గోదాము, రూ.27 లక్షలతో వైద్యాధికారుల క్యాంటీన్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి వారు ప్రారంభించారు. తొలుత అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. హైదరాబాద్ తరహా మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భూపాలపల్లి నీటి వనరులు, ఖనిజ సంపాద ఉన్న జిల్లా అని, ఇక్కడి యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమన్నారు. మహిళలకు మినీ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్వశక్తి గ్రూపుల ద్వారా 64లక్షల మంది మహిళలకు రూ.20వేల కోట్ల నిధులు బ్యాంకులు ద్వారా వస్తున్నాయన్నారు. ఐటీ పరిశ్రమలు సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్రమక్రమంగా ఆరు గ్యారెంటీలను నెరవేరుస్తామని తెలిపారు. రూ.31వేల కోట్లతో రైతు రుణమాఫీ చేస్తున్నామని, ఇప్పటికే రూ.1.50 లక్షల లోపు రుణ మాఫీ అయిందని, ఈ నెలాఖరులోగా రూ.2 లక్షల లోపు ఉన్న రైతులందరికీ మాఫీ అవుతుందన్నారు. ఎవరికైనా మాఫీ కాకపోతే వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి మాఫీ చేస్తామన్నారు. భూమాత పోర్టల్ ద్వారా కొత్త సాఫ్ట్‌వేర్‌తో రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. డీబీఎం-38 కాలువ లింకు ఏర్పాటుకు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతామన్నారు. ఈ నెల చివరి వరకు నియోజకవర్గానికి 3,500, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. భూములు సాగు చేసుకుంటున్న వారికి తప్పకుండా పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ములుగు జిల్లాలోనూ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రోగ నిర్ధాణకు సిటీ స్కాన్, ఎంఆర్ఐ, ప్రొఫెసర్ల నియమాకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూర్తిస్థాయిలో మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. సిబ్బంది ఖాళీల వివరాల నివేదిక అందజేయాలని, ప్రసూతి వైద్యులు నియామకానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆసుపత్రి మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. గతంలో పోడు భూముల వ్యవసాయం చేసుకున్న రైతులను ఇబ్బందులు పెట్టకుండా అటవీ, రెవెన్యూ, పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని మంత్రులు సూచించారు. ఇంటింటా ఇన్నోవేషన్ నైపుణ్యాలను ప్రదర్శనకు చక్కటి అవకాశమని, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమాల్లో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఇండస్ట్రియల్, ట్రేడ్ కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు నిర్మలా జగ్గారెడ్డి, అయిత ప్రకాశ్‌రెడ్డి, ప్రభుత్వ దవాఖాన పర్యవేక్షకుడు నవీన్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు గాజర్ల అశోక్, చెల్పూరు, గణపురం పీఏసీఎస్ చైర్మన్లు గండ్ర సత్యనారాయణరెడ్డి, కన్నెబోయిన కుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ కావటి రజితా రవీందర్, మాజీ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, మాజీ ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు ఎండీ చోటేమియా, కట్కూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**సభలో ఎవరికి వారే..**

పార్క్ ఏర్పాటు శంకుస్థాపన సభలో అధికార పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారు. కార్పొరేషన్ చైర్మన్లు మాట్లాడుతుండగానే సభా వేదిక పైకి నాయకులు గుంపులు గుంపులుగా వచ్చి మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చారు. దీంతో సభా వేదికపై ఏం జరుగుతుందో అక్కడి ప్రజలు, కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. వెంటనే అక్కడ ఉన్న ఎమ్మెల్యే ఉపన్యాసాలు అయిన తర్వాతే వినతులు ఇవ్వాలని సూచించడంతో వారు కిందికి దిగారు. కాగా, అతిథులు మాట్లాడుతుండగా వారికి కనీస గౌరవం ఇవ్వకపోడమేమినటని అక్కడ ఉన్నవారు చర్చించుకోవడం గమనార్హం.

## ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ మూడు నెలల్లో పూర్తి చేయాలి

*వీసీలో మంత్రి పొంగులేటి*

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 3 : నిబంధనల ప్రకారం భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై శనివారం భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి మున్సిపల్, రెవెన్యూ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే భూముల క్రమబద్ధీకరణ జరగాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.గత ప్రభుత్వం 25.70 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు స్వీకరించిందన్నారు. ఇందులో హెచ్‌ఎండీఏ పరిధిలో 3.58 లక్ష లు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1.06 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో 13.69 లక్షలు, గ్రామ పంచాయతీల్లో 6 లక్షలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో 1.35 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. అత్యంత ప్రాధాన్యతాక్రమంలో దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. ఇందుకోసం జిల్లాల్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలని, సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్ తీసుకోవాలన్నారు. ప్రతిపాదనలు పంపిస్తే రెవెన్యూ శాఖ నుంచి సిబ్బందిని సర్దుబాటు చేస్తామని తెలిపారు. పరిశీలనకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటు చేయాలని, క్రమబద్ధీకరణ దరఖాస్తులపై జారీచేసిన నోటీసులకు సంబంధించిన సమస్యలను నివృత్తి చేసేందుకు కలెక్టరేట్లు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ, మున్సిపాలిటీలు మినహా మిగిలిన ప్రాంతాల దరఖాస్తులను కలెక్టర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఇందుకు అవసరమయ్యే అధికారులు, సిబ్బందికి తక్షణమే శిక్షణ ఇవ్వాలన్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న ఏడు జిల్లాల్లో అత్యంత విలువైన భూములున్నాయని, ఈ జిల్లాల్లో లే ఔట్ల క్రమబద్ధీకరణలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

### ప్రైవేట్ టీచర్లకు తగిన గౌరవం ఇవ్వాలి



గిర్మాజీపేట : ఎంతోమంది నిరుద్యోగ యువత డిగ్రీలు, పీజీలు, పలు శిక్షణ కోర్సులు పూర్తిచేసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు లేక ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న తమపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరం. ఏ టీచరైనా విద్యార్థుల ఉన్నతికే పాటుపడుతారని తెలుసుకోవాలి. ప్రైవేట్ ఉపాధ్యాయులను కించపర్చడం సరికాదు.

– వడ్డేపల్లి మనుప్రసాద్ (ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ) వరంగల్

### ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లకు క్యూకడుతున్నరు



గీసుగొండ : ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు క్యూకతున్నరు. ఈ విషయం సీఎం రేవంత్‌కు తెలియదా? తాము ఉన్నత చదువులు చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు దొరకక కుటుంబ పోషణ కోసం ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్నం. తాము మంచి విద్య అందిస్తున్నందునే ఎన్ఐటీ, ఐఐటీ, అనేక పోటీ పరీక్షల్లో ర్యాంకులు వస్తున్నాయి. తమను తక్కువ చేసి మాట్లాడడం సరికాదు.

–బానోతు వీరన్న
(ఉషాదయ హైస్కూల్ టీచర్, గంగదేవిపల్లి )

### విద్యాభివృద్ధిలో ప్రైవేట్ టీచర్లే కీలకం



శాయంపేట: ప్రైవేటు ఉపాధ్యాయులతోనే గ్రామాల్లో విద్యా వ్యాప్తి జరుగుతున్నది. ప్రతి ఉపాధ్యాయుడు బీఈడీ, డీఈడీ చేసి, టెట్ అర్హత పొందిన వారే. పీజీలు చేసి ఉద్యోగాలు లేక ప్రైవేట్ పాఠశాలలో బోధిస్తున్నారు. రాష్ట్రం కోసం ఉద్యమించిన వారిని ప్రజా ప్రభుత్వం అవమానించడం బాధాకరం. హెల్త్‌కార్డులు, పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలు లేకపోయినా విద్యార్థుల ఉన్నతి కోసం ప్రతి నిమిషం శ్రమిస్తున్నారు.

– మామిడి పృథ్వీ, ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులు

### ప్రైవేట్‌లో పీజీ, పీహెచ్‌డీ చేసిన వాళ్లున్నరు..



కాశీబుగ్గ : ప్రైవేట్ పాఠశాలల్లో కుడా పీజీ, పీహెచ్‌డీ చేసిన వాళ్లు ఉన్నరు. ప్రభుత్వ ఉద్యోగాలు రాకపోవడం వల్లే అత్యున్నతంగా చదివి తక్కువ వేతనానికి పని చేస్తున్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల పిల్లలు, మనుమండ్లు, మనుమరాండ్లు ప్రైవేట్ పాఠశాలలోనే చదువుతున్నారు. గవర్నమెంట్ ఉపాధ్యాయులపై నమ్మకం లేకనే ప్రైవేట్‌కు పంపిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల కంటే ప్రైవేట్ వాళ్లే ఎక్కువ కష్టపడి విద్యార్థులకు పాఠాలు చెబుతున్నరు. సీఎం రేవంత్ రెడ్డి అవమానించడం బాధాకరం. ఇకనైనా తమను ప్రభుత్వం గుర్తించాలి.

– జన్ను సారంగపాణి, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



మంగపేట : నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్ఎంసీ పాఠశాల ఉపాధ్యాయులు

# ఇదేనా మీ సంస్కారం?

**సీఎం రేవంత్ అనుచిత వ్యాఖ్యలపై ప్రైవేట్ టీచర్ల ఆగ్రహం**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై ప్రైవేట్ టీచర్లు భగ్గుమన్నారు. 'ఇంటర్ పాసైన వాళ్లు.. డిగ్రీ ఫెయిల్ అయిన వాళ్లు ప్రైవేట్ స్కూళ్లలో బోధిస్తున్నార'ని ఇటీవల ఒక సభలో అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించే టీచర్లకు మీరిచ్చే గౌరవం ఇదేనా? ఇదేనా మీ సంస్కారం అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎంతోమంది డిగ్రీలు, పీజీలు చేసి ప్రభుత్వ ఉద్యోగం దొరకక చాలీచాలని వేతనాలతో పనిచేస్తుంటే గౌరవం వేతనం పెంచాల్సింది పోయి ఇలా అవమానించేలా మాట్లాడడమేంటని మండిపడుతున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల సీఎం వ్యాఖ్యలను వ్యతిరేకించగా ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలోని ఆర్ఎంసీ పాఠశాలలో శనివారం నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. తమ మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని నినాదాలు తెలిపారు. *- నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 3*

**పాఠాలు చెప్పే మాకు మీరిచ్చే గౌరవం ఇదేనా?**

- మనోభావాలు దెబ్బతినేలా అవమానించడం తగదు
- నల్లబ్యాడ్జిలు ధరించి ఉపాధ్యాయుల నిరసన
- వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్
- చాలీచాలని వేతనాలతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నం

### సీఎం క్షమాపణ చెప్పాలి



వరంగల్ చౌరస్తా : ప్రైవేట్ ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి. సర్టిఫికెట్లు ఉంటేనే గురువులు కావొచ్చు, కానీ, విజ్ఞానం, సంస్కారాన్ని బోధించే ప్రతి వ్యక్తి గురువుతో సమానమే.ఈ వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగవు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నవారే ఉన్నత చదువులు చదువుకున్న వారైతే ఆయన కూతురిని ఏ ప్రభుత్వ పాఠశాలలో చదివించారో గుర్తుచేసుకోవాలి. ఎంతమంది ఉపాధ్యాయులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారో లెక్కచూసుకోవాలి.

– అంబటి రాధిక, వీనస్ హై స్కూల్ ఉపాధ్యాయురాలు, చింతల్

## వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు

- సైయంట్ ఫౌండర్, చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి
- ఘనంగా ఎస్సార్ వర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవం
- సినీనటుడు తనికెళ్ల భరణికి డాక్టరేట్ ప్రదానం

హసన్‌పర్తి, ఆగస్టు 3 : వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు సాధ్యమని సైయ్యంట్ టెక్నాలజీస్ ఫౌండర్, చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ శివారులోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో చైర్మన్ వరదారెడ్డి అధ్యక్షతన శనివారం ద్వితీయ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అవగాహన ఎంతో అవసరమని చెప్పారు. విలువలతో కూడిన సాంకేతికతతో అమెజాన్, ఆపిల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ముందువరుసలో నిలిచాయన్నారు. నగరంలోని యువతకు ఉద్యోగావకాశాలు పెంచాలనే ఉద్దేశంతో తన సాఫ్ట్‌వేర్ కంపెనీ సైయ్యంట్ బ్రాంచ్‌ను మడికొండలో(వరంగల్) కూడా ఏర్పాటు చేశానని చెప్పారు. చైర్మన్ వరదారెడ్డి మాట్లాడుతూ.. 2002లో తాను స్థాపించిన ఇంజినీరింగ్ కళాశాల ఎన్నో మైలురాళ్లను దాటి విశ్వవిద్యాలయం స్థాయికి చేరిందన్నారు. నాణ్యమైన విద్యను అందించడం వల్ల న్యాక్, ఏబీసీ అక్రిడిటేషన్, నిర్ఫ్(NIRF) ర్యాంకింగ్ సాధించినట్లు తెలిపారు. అనంతరం సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయన 750కి పైగా తమిళ, తెలుగు, కన్నడ, హిందీ చిత్రాల్లో నటించడంతో పాటు కవి, రచయిత, దర్శకుడిగా సినిమా రంగానికి చేసిన సేవలు గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశామన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ఉత్తీర్ణులైన ఎంటెక్, ఎంబీఏ, బీటెక్, బీబీఏ, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులకు పట్టాలు అందించారు. అనంతరం తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. తన జీవితంలో ఈ డాక్టరేట్ ఒక మైలురాయిగా నిలిచిందని, దీన్ని తన జీవిత భాగస్వామి భవానీకి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీసీ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, కోర్ కమిటీ మెంబర్ మహేశ్, డీన్ రాందేవ్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు.



తనికెళ్ల భరణికి డాక్టరేట్ అందిస్తున్న సైయంట్ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఎస్సార్‌యూ చైర్మన్ వరదారెడ్డి, తదితరులు

# యూరియా కోసం రైతుల బారులు

- పాలకుర్తి రైతు సేవా సహకార సంఘం వద్ద గంటల తరబడి లైన్‌లో నిరీక్షణ
- కొందరికే దొరకకపోవడంతో నిరాశతో వెనుదిరిగిన మిగిలిన రైతులు
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మళ్లీ కష్టాలు మొదలయ్యాయని ఆగ్రహం

పాలకుర్తి, ఆగస్టు 3 : కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం వద్ద శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 450 నుంచి 500ల మంది రైతులు ఉదయమే సహకార సంఘం వద్దకు వచ్చి లైన్‌లో నిలబడి యూరియా కోసం పడిగాపులుగాచారు. గంటల తరబడి లైన్‌లో నిరీక్షించారు. అయినా రైతులందరికీ యూరియా బస్తాలు దొరకక ఇబ్బందిపడ్డారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తానన్న మార్పు ఇదేనా అంటూ మండిపడ్డారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచని ఈ ప్రభుత్వం ఉన్నా ఒక్కటే.. లేకున్నా ఒకటేనన్నారు. మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలోని పాత రోజులు గుర్తుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చాలామంది రైతులు తప్పని పరిస్థితిలో యూరియా కోసం ప్రైవేట్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా, శనివారం సహకార సంఘానికి 444 బస్తాల(ఒక లారీ) యూరియా దిగుమతి కాగా, దాదాపు 185 మంది వరకు పంపిణీ చేసినట్లు సిబ్బంది తెలిపారు. మిగిలిన రైతులకు యూరియా అందక నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు. అయితే ఇప్పటి వరకు 777 బస్తాల యూరియాను రైతులకు పంపిణీ చేశామని కార్యాలయ సిబ్బంది తెలిపారు. వచ్చిన లారీ లోడ్ యూరియాను వచ్చినట్లే వెంటనే రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



పాలకుర్తి: యూరియ కోసం రైతు సహకార సంఘం వద్ద క్యూలైన్‌లో ఉన్న రైతులు

### కాంగ్రెస్‌పాలనలో రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి



మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్క రోజు రైతులు యూరియా కోసం ఇబ్బంది పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు.

– దయ్యాల భిక్షపతి, మల్లంపెల్లి

### యూరియా దొరకక ఇబ్బందిపడుతున్నాం



వానకాలం మొదలైంది. వరి నాట్లు వేశాం.యూరియా కోసం ఎదురు చూస్తున్నాం. పాలకుర్తిలోని రైతు సేవా సహకారం సంఘం వద్దకు వెళితే యూరియా దొరకలేదు. ప్రభుత్వం సరిపడా యూరియా పంపిణీ చేయడం లేదు. తాపకో లారీ వస్తే చొప్పున వస్తే ఇంతమంది రైతులకు ఎలా సరిపోతుంది. ఒక్కసారి ప్రభుత్వం ఆలోచించాలి. గత కేసీఆర్ ప్రభుతంలో రైతులు ఎలాంటి ఇబ్బంది పడలేదు. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులకు యూరియా కష్టాలు మొదలైనయి.

– ఉరుమడ్ల నర్సింరెడ్డి, రైతు, మల్లంపల్లి

## డెంగీ జ్వరంతో నిండు గర్భిణి మృతి

ములుగురూరల్, ఆగస్టు 3 : డెంగీతో నిండు గర్భిణి మృతి చెందిన ఘటన ములుగు జిల్లా జాకారం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంచోజు రాజేంద్రప్రసాద్‌కు ఐదేళ్ల క్రితం వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన అక్షిత(28)తో వివాహం జరిగింది. వీరికి మొదటి కాన్పులో కూతురు జన్మించింది. ప్రస్తుతం రెండో కాన్పు కాగా, ములుగు ప్రభుత్వ దవాఖానలో వైద్యం పొందుతున్నది. 9 నెలలు నిండిన అక్షితకు నాలుగు రోజులుగా జ్వరం రాగా, ములుగులోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందింది. అయినా తగ్గకపోవడంతో నర్సంపేటలోని మరో ప్రైవేట్ దవాఖానలో రెండు రోజుల పాటు చికిత్స తీసుకొని నయం కాకపోవడంతో కుటుంబ సభ్యులు వరంగల్‌లోని మరో ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు డెంగీతోపాటు జాండీస్ అయ్యాయని, తల్లి, బిడ్డకు ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో మెరుగైన చికిత్స కోసం బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి కడుపులో బిడ్డ చనిపోయిందని, శస్త్ర చికిత్స చేసి మృత మగ శిశువును బయటికి తీశారు. అనంతరం చికిత్స పొందుతూ అక్షిత శుక్రవారం మృతి చెందింది. అక్షిత అంత్యక్రియలను శనివారం జాకారం గ్రామంలో నిర్వహించారు. పలువురు రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు మృతదేహాన్ని సందర్శించి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అక్షిత మృతితో డెంగీ జ్వరాలపై ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు, దోమల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అక్షిత (ఫైల్)

## 256 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు
- రెండు కార్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- సీపీ అంబర్ కిశోర్ ఝా వెల్లడి

సుబేదారి, ఆగస్టు 2 : వరంగల్ టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు సంయుక్తంగా 256 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, స్మగ్లర్లను అరెస్టు చేశారు. శనివారం హనుమకొండలోని కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా వివరాలు వెల్లడించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తండాకు చెందిన బానోత్ బాబు కుమారస్వామి, నేరేడుపల్లి గ్రామానికి చెందిన నస్కరి కుమారస్వామి, మహబూబాబాద్‌కు చెందిన జలేందర్, భూపాలపల్లికి చెందిన అంగోత్ రాజేందర్‌తో పాటు పరారీలో ఉన్న ఏపీ తూర్పు గోదావరికి చెందిన ముకుంద్ ముఠాగా ఏర్పడ్డారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఆంధ్రప్రదేశ్‌లోని డొంకవాయి మండలంలో తక్కువ ధరకు 256 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. రెండు కిలోల చొప్పున 128 ప్యాకెట్లలో సర్ది కారులో మహబూబాబాద్ మీదుగా నర్సంపేటకు వస్తున్నారు. కాగా, పోలీసులకు అందిన పక్కా సమాచారంతో కమలాపూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాన్ని ఆపి అందులో ఉన్న ఇద్దరు నిందితులు బానోత్ బాబు కుమారస్వామి, నస్కరి కుమారస్వామిని అరెస్టు చేసి, 256 కిలోల గంజాయి, రెండు కార్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరార్ అయినట్లు సీపీ తెలిపారు. నిందితులను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు సార్ల రాజు, రమణమూర్తిని సీపీ అభినందించారు.



భారీ మొత్తంలో స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా